# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 06-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

❖ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని భారతదేశం అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

❖ దేశంలో అంకుర పరిశ్రమల ఏర్పాటులో యువత కీలక పాత్ర పోషించాలని కేంద్రమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ కోరారు.

❖ వస్తు సేవల పన్ను (GST) సంస్కరణల ద్వారా దేశంలోని మధ్యతరగతి వర్గాలకు పూర్తి ఉపశమనం కలుగుతుందని కేంద్ర సమాచార ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

❖ దేశవ్యాప్తంగా వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

❖ తూర్పు రాజస్థాన్, గుజరాత్‌లలో రేపు భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (IMD) అంచనా వేసింది.

=======================

భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని భారతదేశం అమెరికా ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమంలో చేసిన పోస్టులో భారత్ అమెరికా తాజా సంబంధాల పట్ల స్పందించారు. అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ ఆలోచనలను ఇరు దేశాల సంబంధాలపై ఆయన సానుకూల వైఖరిని తాను అభినందిస్తున్నానని ప్రధానమంత్రి అన్నారు. అమెరికా అధ్యక్షుడి ఇటీవలి ప్రకటనకు ప్రతిస్పందిస్తూ.. నరేంద్రమోదీ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. దీనిపై భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ న్యూఢిల్లీలో ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... అమెరికాతో భారతదేశ భాగస్వామ్యానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. భారత్ అమెరికాతో సంబంధాలు కొనసాగిస్తుందని ఆయన పేర్కొంటూ..

(వాయిస్ 22 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో అంకుర పరిశ్రమల ఏర్పాటులో యువత కీలక పాత్ర పోషించాలని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖా మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ కోరారు. యువతకు సాధికారత కల్పించడం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని చెప్పారు. న్యూఢిల్లీలో క్యాంపస్ ట్యాంక్‌ను ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ క్యాంపస్ ట్యాంక్ వేదిక ద్వారా దేశంలోని యువత తమ వినూత్న ఆలోచనలను ఆవిష్కృతం చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. తమ ఉపాధి ఆరంభంలోనే యువత సొంతంగా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు. రానున్న కాలంలో భారతదేశాన్ని ప్రపంచ స్టార్టప్ హబ్‌గా మార్చడంలో యువత పాత్ర గణనీయంగా ఉంటుందన్న ఆశాభావాన్ని కేంద్రమంత్రి వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

వస్తు సేవల పన్ను (GST) సంస్కరణల ద్వారా దేశంలోని మధ్యతరగతి వర్గాలకు పూర్తి ఉపశమనం కలుగుతుందని కేంద్ర సమాచార ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. న్యూఢిల్లీలో ఆయన ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... GST సంస్కరణలతో దేశ ఆర్థిక వ్యవస్థ గణనీయంగా మెరుగుపడుతుందన్నారు. 2014 సంవత్సరానికి ముందు సంక్లిష్టమైన పన్నుల విధానం దేశంలో అమలు కావడం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. GST సంస్కరణల ద్వారా ఇప్పుడు ఆర్థిక వ్యవస్థను సరళీకరించి స్థిరీకరించామని అశ్విని వైష్ణవ్ పేర్కొంటూ..

(వాయిస్ 40 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ఈ రోజు ఘనంగా నిర్వహించారు. ముంబైలో జరిగిన నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కార్పొరేషన్ అధికారులతో కలసి పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ముంబై లో పలు చోట్ల నుండి వచ్చే వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం స్థానికంగా ఉన్న 65 సహజ జల వనరులతో పాటుగా 205 కృత్రిమ చెరువులను కూడా ఏర్పాటు చేశారు. ఊరేగింపులను పర్యవేక్షించడానికి పోలీసులు మొదటిసారిగా కృత్రిమ మేధ (AI) సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించారు. అదే విధంగా పూణేలోని గణేష్ విగ్రహ నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాలలో పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, రాష్ట్ర ఉన్నత విద్యా శాఖా మంత్రి చంద్రకాంత్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణా రాష్ట్రంలో అనేక చోట్ల ఉత్సాహపూరిత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశంలోనే ప్రత్యేకతను సంతరించుకున్న ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం భక్తజనుల సందడి మధ్య ఘనంగా జరిగింది. 69 అడుగుల ఎత్తు, 50 టన్నులున్న గణనాథుడిని ప్రత్యేక వాహనంపై హుస్సేన్‌సాగర్ కి చేర్చిన అనంతరం నిమజ్జనం నిర్వహించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

వస్తు సేవల పన్ను (GST) సంస్కరణల ద్వారా దేశంలోని మధ్యతరగతి, సామాన్య ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్ డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ (CBIC) చైర్మన్ సంజయ్ కుమార్ అగర్వాల్ అన్నారు. GST సంస్కరణల గురించి ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అత్యధిక శాతం ప్రజలకు ప్రయోజనం కలిగిస్తుందని చెప్పారు. అదేవిధంగా మధ్య తరగతి, పేదలు ఎక్కువగా ఆధారపడిన రంగాల మీద GST సంస్కరణల ప్రభావం ఉంటుందని తెలిపారు. ఈ సంస్కరణ ఫలితాలు రానున్న కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థను సైతం పటిష్టం చేస్తాయని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడం కోసం భారత్ - ఫ్రాన్స్ కలసి పని చేస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఫ్రాన్స్ దేశ అధ్యక్షులు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ తో ప్రధానమంత్రి ఈ రోజు ఫోన్ ద్వారా సంభాషించారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారం కొనసాగే విషయం చర్చకు వచ్చింది. అంతర్జాతీయ అంశాలతో పాటు.. ఉక్రెయిన్ యుద్ధం ముగింపు కోసం చేపట్టాల్సిన అంశాలపై కూడా రెండు దేశాల అధినేతలు సంభాషించారు. ఆర్థిక, రక్షణ, సైన్స్, టెక్నాలజీ, అంతరిక్షం సహా వివిధ రంగాలలో ద్వైపాక్షిక సహకారంలో జరిగిన పరిణామాలను ఇరువురు నాయకులు సమీక్షించారు. 2047 రోడ్‌మ్యాప్, ఇండో-పసిఫిక్ రోడ్ మ్యాప్, డిఫెన్స్ ఇండస్ట్రియల్ రోడ్ మ్యాప్‌కు అనుగుణంగా భారతదేశం-ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి అగ్ర నాయకులు ఇద్దరూ తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. 2026 ఫిబ్రవరిలో భారతదేశంలో నిర్వహించే కృత్రిమ మేధ (AI) ఇంపాక్ట్ సమ్మిట్‌కు హాజరు అయ్యేందుకు అంగీకరించినందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) సంస్కరణలకు మద్దతు తెలిపినందుకు అన్ని రాష్ట్రాలకు కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆమె రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు లేఖ రాశారు. పన్ను రేట్లను సవరించడంలో రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి రావడం గొప్ప విషయమని అందులో పేర్కొన్నారు. జీఎస్టీలో సంస్కరణలను అమలు చేయడంలో రాష్ట్రాల మద్దతు వారి చురుకైన పాత్ర కీలకంగా ఉందని కేంద్రమంత్రి అన్నారు. జీఎస్టీ సంస్కరణలు సామాన్యులకు నిస్సందేహంగా ప్రయోజనం చేకూరుస్తాయని చెప్పారు. ఈ సంస్కరణల తర్వాత ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

తూర్పు రాజస్థాన్, గుజరాత్‌లలో రేపు భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (IMD) అంచనా వేసింది. రాజస్థాన్, కొంకణ్, గోవా, మధ్య మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లోని మిగిలిన ప్రాంతాల్లో సైతం భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. అదేవిధంగా ఈశాన్య భారతదేశంలోని కొన్ని ప్రదేశాలలో కూడా భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఆ వివరాలను వాతావరణ శాస్త్రవేత్త రఘు నడింపల్లి తెలియచేస్తూ...

(వాయిస్ 22 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

వస్తు సేవల పన్ను (జీఎస్టీ) సంస్కరణల ద్వారా దేశంలోని సహకార సంస్థలు, గ్రామీణ సంస్థలు పెద్ద ఎత్తున లాభపడనున్నాయని కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. దేశంలోని 10 కోట్లకు పైగా పాడి రైతులకు ప్రయోజనం చేకూర్చే కీలక రంగాలలో వస్తు సేవల పన్నులలో పెద్ద ఎత్తున తగ్గింపులను కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రకటించిందని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =